కారు ఖాళీ

- శేరిలింగంపల్లిలో బీఆర్‌ఎస్‌కు బిగ్‌షాక్
- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ కాంగ్రెస్‌లో చేరికతో మారిన సమీకరణాలు
- ఎమ్మెల్యేతో పాటు కార్పొరేటర్లు, ముఖ్య నేతలు జంప్

మియాపూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లిలో బీఆర్‌ఎస్‌కు బిగ్‌షాక్ తగిలింది. ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీతో పాటు కార్పొరేటర్లు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరడంతో నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారిపోయాయి. ఒకరిద్దరు మినహాయిస్తే నియోజకవర్గంలో దాదాపు బీఆర్‌ఎస్ ఖాళీ అయినట్లు తెలుస్తోంది. వివేకానందనగర్ కార్పొరేటర్ రోజారంగారావు, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా కాంగ్రెస్‌లో చేరలేదు. ఇదివరకే కొండాపూర్, ఆల్విన్ డివిజన్ కార్పొరేటర్లు హమీద్‌పటేల్, వెంకటేష్‌గౌడ్ సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఖాళీ కావడంతో కాంగ్రెస్ బలమైన పార్టీగా గుర్తింపు పొందే అవకాశం ఉంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ కొద్దినెలలుగా నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నేరవేర్చలేక ముందుకు వెళ్లలేకపోతున్నానని, నాయకులు, కార్యకర్తల అభీష్టం మేరకు కాంగ్రెస్‌లో చేరినట్లు ఆయన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఆయన వెంట కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్, మంజులరెడ్డితో పాటు పార్టీ నాయకులు మొవ్వా సత్యనారాయణ, సీనియర్ నాయకులు రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో తీర్థం పుచ్చుకున్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు, నాయకులు

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

కూకట్‌పల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గం కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డినగర్‌కు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఆధ్వర్యంలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు చిట్టిరెడ్డి శ్రీధర్‌రెడ్డితోపాటు కాలనీకి చెందిన 10 మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. దేవేందర్‌రెడ్డి, బాలనర్సయ్య, సాయిరెడ్డి, శోభా, కృష్ణారెడ్డి, గోపాల్ రెడ్డి, పద్మ, కరుణశ్రీ, భూలక్ష్మి, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

ఎవరు వెళ్లినా బీఆర్‌ఎస్ అధైర్యపడొద్దు

చందానగర్: ఉద్యమాల పునాదిపైనే బీఆర్‌ఎస్ ఆవిర్భవించిందని, పార్టీ సముద్రం లాంటిందని ఎందరో వస్తారు.. పోతారు అలాంటి వారిని పట్టించుకోవద్దని పార్టీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి అన్నారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని ఎవరూ అధైర్యపడొద్దని ఆయన తెలిపారు. ఒకరు వెళ్లితే పదిమంది లీడర్లను పార్టీ తయారు చేస్తుందని, సముద్రం లాంటి పార్టీలో చెత్తకొట్టుకుపోయినా నష్టం లేదన్నారు. పదవులు అనుభవించి ఇతర పార్టీలోకి వెళ్లే అవకాశవాదులకు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు.

కాంగ్రెస్‌లో రెండు వర్గాలు ఏకమయ్యేనా..?

ఇటీవల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన జగదీశ్వర్‌గౌడ్, బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఆరెకపూడి గాంధీపై ఓడిపోయారు. ఎమ్మెల్యే గాంధీ ఉండగా, నియోజకవర్గ ఇన్‌చార్జిగా జగదీశ్వర్‌గౌడ్ వ్యవహరిస్తున్నారు. ఎన్నికల ముందు కార్పొరేటర్‌గా ఉన్న జగదీశ్వర్‌గౌడ్ ఆయన సతీమణి పూజిత బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. వారు కాంగ్రెస్ పార్టీలో చేరిననాటి నుంచి ఆయన అనుచరగణంతో పాటు పార్టీ సానుభూతి పరులు, అందరినీ కలుపుకుని నియోజకవర్గ ఇన్‌చార్జిగా జగదీశ్వర్‌గౌడ్ వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో చాలా మంది ఆయనను నమ్ముకుని పార్టీ లో చేరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికార పార్టీ ఇన్‌చార్జిగా జగదీశ్వర్‌గౌడ్ దూసుకుపోతున్న నేపథ్యంలో బేధాభిప్రాయాలు లేకుండా పార్టీ అధిష్టానం ఇద్దరిని కలిపి ఏకపక్షంగా కలిపి ముందుకు తీసుకువెళ్తుందా అనే విషయంలో రాజకీయ విశ్లేషకులు భిన్నాభిప్రాయాలు వ్యక్తమౌతుంది.



ఎమ్మెల్యే వివేకానంద్‌కు వినతిపత్రం ఇస్తున్న కావ్య అసోసియేషన్ సభ్యులు

పెండింగ్ పనులను త్వరలో చేపడతాం : ఎమ్మెల్యే

నిజాంపేట్, జూలై 13(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులతో పాటు నూతన పనులను త్వరలోనే చేపడుతామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పలు కాలనీల ప్రజలకు హామీ ఇచ్చారు. నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లిలోని కావ్య ఎవెన్యూ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శనివారం ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయిన పనులను త్వరిత గతిన పూర్తి చేసి, నూతనంగా చేపట్టవలసిన పనుల త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. ఈ వినతిపత్రం ఇచ్చిన వారిలో కాలనీ అధ్యక్షుడు విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ప్రసన్న బాబు, కోశాధికారి రామకృష్ణ, సంక్షేమ సంఘం సభ్యులు ప్రసాద్, శ్రీకాంత్, వీఎన్ చారి, ఎన్.మురళి, కె.మురళి, సరిత ఉన్నారు.

సమాజాభివృద్ధిలో సైన్స్ కీలకపాత్ర



మాట్లాడుతున్న శాంతారావు

రాయదుర్గం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మానవ పరిణామ క్రమంలోనూ, సమాజాభివృద్ధిలోనూ సైన్స్ కీలకపాత్ర పోషిస్తోందని ప్రముఖ సాహితీవేత్త, సాంస్కృతిక, సామాజిక కార్యకర్త శాంతారావు అన్నారు. జనవిజ్ఞాన వేదిక హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో గచ్చిబౌలి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం 'సైన్స్-సమాజం' అనే అంశంపై శిక్షణా తరగతులు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాంతారావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సాంకేతికత అభివృద్ధి చెందేకొద్దీ మానవ సంబంధాలు నిర్వీర్యం అవుతున్నాయని ఆయన విచారం వ్యక్తం చేశారు. జన విజ్ఞాన వేదిక కార్యకర్తలు మానవతను పెంపొందిస్తూనే సైన్స్ వ్యాప్తికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జీవితం నిరంతరం నేర్చుకునే ప్రక్రియని కొత్త విషయం నేర్చుకోనిరోజున మనం చనిపోయినట్లే లెక్కని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కమిటీ అధ్యక్షుడు ఎం.భరత్, ప్రధాన కార్యదర్శి, రవీంద్రబాబు, గచ్చిబౌలి కమిటీ ప్రధాన కార్యదర్శి రాహుల్, ముషీరాబాద్ కమిటీ ప్రధాన కార్యదర్శి బీమేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



సునీతాప్రభాకర్‌రెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న జగదీశ్వర్‌గౌడ్

శేరిలింగంపల్లి కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నియామకం

చందానగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా చందానగర్‌కు చెందిన మాజీ కౌన్సిలర్ సునీతా ప్రభాకర్‌రెడ్డిని నియమించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ చేతుల మీదుగా ఆమెకు నియామకపత్రాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధి కోసం అందరినీ కలుపుకుని ముందుకెళ్తామని పేర్కొన్నారు. అదేవిధంగా తనపై నమ్మకం ఉంచి ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు జగదీశ్వర్‌గౌడ్, జెరిపెటి జైపాల్‌తో పాటు తనకు పదవి రావడానికి సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.



వేం నరేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న కూకట్‌పల్లి కాంగ్రెస్ నేతలు

వేం నరేందర్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

కూకట్‌పల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకుల బృందం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని తన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయనను కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులైన ఇతర పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో శేరి సతీష్‌రెడ్డి, నాగిరెడ్డి, తూము వేణు, సంజీవరావు, మేకల మైఖేల్, లక్ష్మణ్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, సునీల్‌యాదవ్, రాఘవేంద్రరావు, పుష్పారెడ్డి, ఫణీంద్రకుమార్, శివచౌదరి పాల్గొన్నారు.

రోడ్డును బాగు చేయండి



గిరినగర్‌లో గుంతలమయంగా మారిన రోడ్డు

పేట్‌బషీరాబాద్, జూలై 13(ఆంధ్రజ్యోతి): మురుగు నీటి పైప్‌లైన్ పనులను పూర్తి చేసి కాంట్రాక్టర్ గుంతలను పూడ్చక పోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలతో గుంతల్లో నీళ్లు నిలిచి ప్రమాదకరంగా మారాయని ఆ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రంగారెడ్డి నగర్ డివిజన్‌లోని గిరినగర్‌లో ఇటీవల మురుగు నీటి పైప్‌లైన్ పనుల కోసం రోడ్డును తవ్వారు. పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్ రోడ్డుకు సమాంతరంగా మట్టిని పూడ్చ లేదు. ఫలితంగా రోడ్డు గుంతలమయంగా మారింది. దీనికి తోడు వర్షంనీరు గుంతల్లో చేరి వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. పాదచారులు, ద్విచక్ర వాహహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. రహదారిలో ఉన్న గుంతలను పూడ్చాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.



చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్క

గుర్రపు డెక్కను తొలగించాలి

పేట్‌బషీరాబాద్, జూలై 13(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డివిజన్‌లోని వెన్నెల గడ్డ ఎన్నా చెరువు మొత్తం గుర్రపు డెక్క విస్తరించింది. దీనికి తోడు మురుగు నీరు చెరువులో కలుస్తుండడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. పరిసర కాలనీల ప్రజలు దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి గుర్రపు డెక్కను తొలగించాలని, మురుగు నీరు చెరువులో కలువకుండా చూడాలని కాలనీల ప్రజలు అధికారులను కోరుతున్నారు.

వ్యక్తి మృతదేహం స్వాధీనం



వ్యక్తి మృతదేహం

గాజులరామారం, జూలై 13(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం సూరారం పోలీసులకు శనివారం లభ్యమైంది. సూరారం సాయిపూజ సినిమా థియేటర్ ఎదురుగా హెవెన్ రెస్టారెంట్ గేటు పక్కన సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే సూరారం పోలీసులకు తెలియజేయాలన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న చంద్రశేఖర్, నేతలు

మహిళా కండక్టర్లకు సెకండ్‌షిఫ్ట్ డ్యూటీలు వద్దు

- ఎస్‌డబ్ల్యూయూఐఎన్‌టీయూసీ

హైదరాబాద్‌సిటీ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో మహిళా కండక్టర్లకు సెకండ్ షిఫ్ట్ డ్యూటీలు నిలిపివేయాలని ఎస్‌డబ్ల్యూయూఐఎన్‌టీయూసీ జాతీయ ప్రధానకార్యదర్శి ఆర్‌డీ.చంద్రశేఖర్ అన్నారు. ఎస్‌డబ్ల్యూ యూఐఎన్‌టీయూసీ మహిళా విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ ఆర్టీసీ మహిళా కండక్టర్ల సదస్సు ను శనివారం నిర్వహించారు. సదస్సులో మహిళా కండక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో మహిళా కండక్టర్ల పాత్ర చాలా ప్రధానమైందన్నారు. ప్రధానకార్యదర్శి అబ్రహం మాట్లాడుతూ చిన్నచిన్న కేసుల్లో మహిళా కండక్టర్లను సస్పెండ్ చేయవద్దని సూచించారు. కొంతమంది అధికారులు మహిళా కండక్టర్లకు కష్టమైన డ్యూటీలేవేస్తూ వేధిస్తున్నారన్నారు.

17న కాకతీయం నృత్యప్రదర్శన

- హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి

రవీంద్రభారతి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కాకతీయ రాజవంశం కాలం నాటి ప్రాచీన నృత్య సంప్రదాయాలను పునరుద్ధరించడానికి, తెలంగాణ నృత్య ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పేందుకు కాకతీయం నృత్య నాటకం రూపొందించినట్లు ప్రముఖ నర్తకీమణి పద్మశ్రీ డాక్టర్ పద్మజారెడ్డి తెలిపారు. పదేళ్లుగా విస్తృత పరిశోధనలు చేసి తీర్చిదిద్దిన కాకతీయం రెండు భాగాలను ఇటు భారతదేశం, అటు అమెరికాలోని పలు వేదికలపై ప్రదర్శించి అభినందనలు అందుకున్నట్లు వివరించారు. సుసంపన్నమైన వారసత్వం, క్లిష్టమైన సుందరమైన నృత్యప్రక్రియలను ప్రోత్సహించడంలో భాగంగా ఇప్పుడు కాకతీయం పార్ట్-3 ప్రదర్శించనున్నట్లు పద్మజారెడ్డి తెలిపారు. ఈ నెల 17వ తేదీ సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతిలో కాకతీయం నృత్యనాటకాన్ని ప్రదర్శించున్నట్లు తెలిపారు.

భార్యను హత్య చేసి పారిపోయిన భర్త రిమాండ్



ప్రదీప్ బోలా

ఉప్పల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): భార్యను హత్య చేసి గోనె సంచిలో పెట్టి పారిపోయిన భర్తను ఉప్పల్ పోలీసులు అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి, ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఒరిస్సా కేంద్రపరా జిల్లా అయభ గ్రామానికి చెందిన ప్రదీప్‌బోలా(32), మధుమిత(24)లకు 2019లో వివాహం జరిగింది. మూడు నెలల కాపురం అనంతరం జీవనోపాధి కోసం భార్యాభర్తలు ఇద్దరు కలిసి హైదరాబాద్‌లోని ఉప్పల్ న్యూభరత్‌నగర్‌లో ఉంటున్నారు. తర్వాత మధుమిత గర్భవతి కావడంతో ఒరిస్సాలోని ఆమె తల్లిదండ్రుల ఇంటి వద్ద వదిలిపెట్టి తిరిగి హైదరాబారాద్‌కు వచ్చాడు. మధుమితకు కుమార్తె పుట్టిన తర్వాత ప్రదీప్‌బోలా వారిని చూసేందుకు వెళ్లలేదు. దీంతో మధుమిత కేంద్రపరా పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనంతరం గ్రామ పెద్ద సమక్షంలో రాజీ కుదుర్చుకున్న ప్రదీప్ తన వెంట మధుమితను హైదరాబాద్‌కు తీసుకొచ్చాడు. ఆ తర్వాత కూడా తరుచూ దంపతులిద్దరి మధ్య చీటికి మాటికి గొడవల కొనసాగాయి. ఈనెల 7న ఉదయం ఇద్దరి మధ్య వివాదం ముదరడంతో ప్రదీప్ రొట్టెలు చేసే పీటతో మధుమిత తలపై బాదాడు. దీంతో ఆమె కింద పడిపోయింది. వెంటనే చున్నీని మెడకు చుట్టి చంపాడు. తర్వాత మృతదేహాన్ని సంచిలో కుక్కి బాత్‌రూమ్‌లో పెట్టి ఇంటికి తాళం వేసి కుమార్తెను తీసుకొని సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు పారిపోయాడు. అక్కడ ఒక వ్యక్తికి ఇప్పుడే వాష్‌రూమ్‌కు పోయి వస్తానని చెప్పి తన చేతిలోని పాపను ఇచ్చి పారిపోయాడు. ప్రదీప్ ఎంతకు రాకపోవడంతో పాపను రైల్వే పోలీసుల సహాయంతో చైల్డ్ హోమ్‌కు అప్పగించారు. అయితే, పారిపోయిన ప్రదీప్ తనకు తెలిసిన వ్యక్తి ద్వారా బేగంపేటలోని హోటల్‌లో పని చేస్తున్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు గతంలో పని చేసిన హోటల్ యజమాని ఇచ్చిన సమాచారంతో నిందితుడిని బేగంపేటలో అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం బయటపెట్టాడు. దీంతో అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

విద్యుత్‌శాఖ ఎల్సీ ఇవ్వకపోవడంతో అభివృద్ధి పనుల్లో జాప్యం



మాట్లాడుతున్న నక్క యాదగిరి, జీసీ రెడ్డి

హైదరాబాద్ సిటీ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ గత మూడునెలలుగా లైన్‌క్లియరెన్స్(ఎల్సీ)లు ఇవ్వకపోవడంతో అభివృద్ధి పనులపై ప్రభావం పడుతోందని, స్టోర్లలో మెటీరియల్ పూర్తిస్థాయిలో లభించడం లేదని తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.సి.రెడ్డి అన్నారు. శనివారంలో బాలానగర్‌లో తెలంగాణ కాంట్రాక్టర్ల ఆధ్వర్యంలో టీజీఎస్పీడీసీఎల్‌లో కాంట్రాక్టర్ల సమస్యలపై సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యుత్ స్టోర్లలో ఒక మెటీరియల్ ఉంటే మరో మెటీరియల్ లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ప్రైవేట్ సెక్టార్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టర్లు వెండర్‌కోడ్ తీసుకోవాలని సీఎండీ ఉత్తర్వులు జారీచేయడంతో వెండర్‌కోడ్ తీసుకున్నారని, అయినా ఇబ్బందులు తప్పడం లేదన్నారు. లైన్ క్లియరెన్స్ అంశంలో డిస్కం అవలంబిస్తున్న విధానాలతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టి వారాలు గడుస్తున్నా వాటిని చార్జ్‌చేయని పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. ప్రైవేట్ సెక్టార్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టర్లకు స్పెషలైజేషన్ ఉండాలని రాష్ట్ర ప్రధానకార్యదర్శి మారగోని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. విధి నిర్వహణలో ప్రమాదాలు జరిగితే ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి సాయం అందడం లేదన్నారు. తెలంగాణ ఎలక్ట్రిసిటీ లైసెన్సింగ్ బోర్డు మాజీ సభ్యుడు నక్కయాదగిరి మాట్లాడుతూ ప్రైవేట్, ప్రభుత్వ, ఇండస్ట్రియల్, కమర్షియల్ ఇలా ఏ రంగంలో పనిచేసిన కాంట్రాక్టర్ అనే వ్యక్తి తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్స్ పొందాలన్నారు. ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు సభ్యుడు నేమాల బెనర్జీ, రాష్ట్రకార్యవర్గ సభ్యులు ఆలూరు మహేందర్, ఆర్.ప్రదీప్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి యువతి ఆత్మహత్య



శ్రుతి మృతదేహం

మియాపూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్ పై నుంచి దూకి ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జనప్రియ అపార్ట్‌మెంట్స్‌లో నివాసం ఉండే బొరగడ్డ కిస్టఫర్ కూతురు శ్రుతి(35) ఎం.ఫార్మసీ పూర్తిచేసి ఇంటివద్దే ఉంటుంది. జాబ్ రాకపోవడం, పెళ్లి సంబంధాలు కుదరకపోవడంతో తీవ్రమనస్తాపానికి గురైంది. ఈ క్రమంలో శనివారం ఉదయం 11 గంటలకు వారుంటున్న అపార్ట్‌మెంట్ పక్క భవనం 4వ అంతస్తు పై నుంచి దూకింది. ఈ ఘటనలో శ్రుతి తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం మియాపూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పుస్తక పఠనంపై ఆసక్తిని పెంచడం గొప్పవిషయం

హైదరాబాద్ డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీనివాస్



కార్యక్రమానికి హాజరైన ముఖ్యఅతిథులతో ఆకర్షణ సతీష్

పద్మారావునగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో పుస్తక పఠన ఆసక్తిని పెంపొందించటానికి హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న ఆకర్షణ సతీష్ కృషి అభినందనీయమని హైదరాబాద్ డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. బోయగూడలోని నవజీవన అనాథ బాలికల హాస్టల్‌లో ఆకర్షణ వారి తల్లిదండ్రుల సహకారంతో ఏర్పాటు చేసిన ఓపెన్ లైబ్రరీని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. అతిచిన్న వయస్సులో ఆకర్షణ ఒక సంఘటన ద్వారా స్ఫూర్తి పొంది, వేల పుస్తకాలను సేకరించి, తెలుగు రాష్ట్రాలతో పాటుగా తమిళనాడులో అనేక లైబ్రరీలను ఏర్పాటు చేయడం గొప్ప విషయమని తెలిపారు. తను చేస్తున్న సేవలకు గుర్తింపుగా భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, ప్రధాని నరేంద్రమోదీ వంటి ఎందరో ప్రముఖులు ఆమెను అభినందించారని తెలిపారు. ఈ లైబ్రరీని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆకర్షణ తండ్రి సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. కోవిడ్ వంటి ప్రాణాంతక వ్యాధి ప్రబలుతున్న 2021లో ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రిలో రోగులకు ఆహారం అందిస్తున్న సమయంలో ఒక రోగి తనకు కాలక్షేపానికి పుస్తకాలు కావాలని అడగడంతో తన కూతురు ఆకర్షణకు కలిగిన ఆలోచనకు ప్రతిరూపమే ఓపెన్ లైబ్రరీల ఏర్పాటు అని తెలిపారు. ఇప్పటి వరకు వివిధ ప్రాంతాలలో 14 లైబ్రరీలను ఏర్పాటు చేశామని, అపార్టుమెంటువాసులు, స్నేహితులు బంధువుల నుంచి ఇప్పటి వరకు దాదాపుగా 9 వేల పుస్తకాలను సేకరించామని తెలిపారు. తన కూతురు చేస్తున్న సేవలను గుర్తించిన ప్రధాని నరేంద్రమోదీ ఈ విషయాన్ని మన్‌కి బాత్ కార్యక్రమంలో ప్రస్తావించారని తెలిపారు. భవిష్యత్‌లో ప్రారంభించే 25వ లైబ్రరీ ప్రారంభోత్సవానికి స్వయంగా నరేంద్రమోదీ హాజరవుతానని మాటిచ్చారని ఈ సందర్భంగా తెలియజేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు తస్నీరు ప్రమోద, విజయభాస్కర్, సయ్యద్ నబీ, జీవిత, హైదరాబాద్ యూనిసెఫ్ ప్రోగ్రామ్ మేనేజర్ డేవిడ్‌రాజ్, ఇఫ్లూ రిటైర్డ్ ప్రొఫెషనల్ అసిస్టెంట్ (లైబ్రరీ) టీ.వీ.ప్రఫుల్లా చంద్ర, కేంద్రం బాలికలు, నన్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

పేట్‌బషీరాబాద్, జూలై 13(ఆంధ్రజ్యోతి): గాజులరామారం డివిజన్‌లోని షిరిడిహిల్స్ సంక్షేమ సంఘం సభ్యులు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను జీడిమెట్ల డివిజన్‌లోని దండమూడి ఎన్‌క్లేవ్‌లోని ఆయన నివాసంలో కలిసి సీసీ రోడ్డులు, వీధి దీపాలు, మురుగు నీటి మరా మ్మతులపై వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా త్వరలోనే ప్రణాళికలు రూపొందించి పనులను పూర్తి చేయిస్తానని వారికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రమేష్, ఉపాధ్య క్షులు డి. బ్రహ్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్తిబాబు, సభ్యులు వేణుగోపాలచారి, రవి ఉన్నారు.

సారెగూడెంలో ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

దుండిగల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ దొమ్మరపోచంపల్లి, విద్యుత్ సబ్-స్టేషన్ పరిధిలోని సారెగూడెం గ్రామంలో 11 కేవీ విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతూ ప్రజలకు తగిలే విధంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో వ్యవసాయం చేసే రైతులు, గ్రామస్తులు నిత్యం ఈ కరెంట్ తీగల కింది నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. ఈ విద్యుత్ వైర్లు మనుష్యులకు తగిలేంత కిందికి వేలాడుతున్నాయి. ఈ వైర్లను సరి చేసి, ప్రమాదాలను అరికట్టాలని పలుమార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే, సారెగూడెం వాసులందరం కలిసి సబ్- స్టేషన్ ముందు ఆందోళన చేస్తామని అధికారుల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరగక ముందే ఈ విద్యుత్ వైర్లను సరి చేసి, ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరుతున్నారు.

బైక్ చోరీ ముఠా అరెస్ట్

హైదరాబాద్ సిటీ, జూలై 13(ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాల్లో రెక్కీ చేసి, ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న దొంగల ముఠాను పట్టుకున్నారు మీర్‌చౌక్ పోలీసులు. మొత్తం ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. సౌత్‌జోన్ డీసీపీ స్నేహమెహరా శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఉప్పుగూడకు చెందిన గాదె శివరాజ్, బోడుప్పల్‌కు చెందిన మల్లం గణేష్, వలిగొండకు చెందిన పులిపాల్పుల శివ, నకిరేకల్‌కు చెందిన మల్లం నర్సింహ, తిప్పర్తికి చెందిన ఏపూరి విద్యాసాగర్‌లు ఒక ముఠాగా ఏర్పడి నగరంలోని పలు ప్రాంతాల్లో రెక్కీ చేసి, బైక్‌లు చోరీ చేస్తున్నారు. వాటిని ఇతర జిల్లాలకు తరలించి తక్కువ ధరకు అమ్మేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో జూన్ 29న మీరాలంమండి వద్ద నరేష్‌కుమార్ అనే వ్యాపారి తన ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేయగా.. చోరీకి గురయింది. దీంతో బాధితుడు మీర్‌చౌక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాంతో రంగంలోకి దిగిన మీర్‌చౌక్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా టెక్నికల్ ఎవిడెన్స్‌ను సేకరించి దొంగల ముఠాను పట్టుకున్నారు. వారి నుంచి 12 బైక్‌లను రికవరీ చేశారు.

రూ. 50 వేలు, 2 తులాల బంగారం తేవాలి

- అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తపై ఫిర్యాదు

యూసుఫ్‌గూడ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): 50 వేల రూపాయలు, తులం బంగారం అదనపు కట్నం తేవాలని వేధిస్తున్న భర్తపై ఓ భార్య మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ గన్నవరం ప్రాంతానికి చెందిన మహిళకు గతంలోనే పెళ్లి కాగా భర్త చనిపోయాడు. ఆమెకు ఆరేళ్ల కుమారుడు ఉన్నాడు. అదే ప్రాంతానికి చెందిన మల్లేశ్వరరావు తనను, తన కుమారుడిని బాగా చూసుకుంటానని తనను పెళ్లి చేసుకోవాలని ప్రాధేయపడ్డాడు. దీంతో సంవత్సరం క్రితం వివాహం చేసుకుని బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి ఎల్బీ నగర్‌లో నివాసం ఉన్నారు. ఇటీవల రహ్మత్‌నగర్‌కు మకాం మార్చి ఇద్దరూ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొంతకాలంగా మల్లేశ్వరరావు మద్యం తాగి భార్యను హింసించటం మొదలుపెట్టాడు. నాలుగు రోజుల క్రితం భార్యకు చెప్పకుండా గన్నవరం వెళ్లాడు. భార్య ఫోన్ చేసి ఇంటికి రావాలని అడుగగా 'నేను రాను, నీ దగ్గరకు రావాలంటే 50 వేల రూపాయలు, రెండు తులాలు బంగారం కావాలి' అని భర్త తేల్చి చెప్పాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

శారీరక రుగ్మతలపై అవగాహనకు 5కే రన్ నేడు

కూకట్‌పల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలోని ఆకార్ ఆశా ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం 5కే రన్ నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి ప్రతినిధి అరుణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కూకట్‌పల్లి జాతీయ రహదారిలోని పిల్లర్ నెంబర్ ఏ 782 సమీపంలోని ఆకార్ ఆశా ఆసుపత్రి ముందు నుంచి కేపీహెచ్‌బీకాలనీ, జేఎన్‌టీయూ మీదుగా తిరిగి కూకట్‌పల్లి వరకు రన్ కొనసాగుతుందని వివరించారు. శారీరక రుగ్మతలు తొలగించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రన్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆదివారం ఉదయం 6:30 గంటలకు రన్ ప్రారంభమవుతుందని తెలిపారు.